క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న అక్కరమాని

ఎంవీపీకాలనీ: వైఎస్సార్ బీమా చెక్కులను వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పలువురు లబ్ధిదారులకు శనివారం అందజేశారు. 19వ వార్డు పెద జాలరిపేటలో తొలుత ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మాడు పోలరాజు భార్య సత్యవతి, కంచుమూర్తి సతీష్ భార్య పైడిలకు బీమా చెక్కులను అక్కరమాని అందజేశారు. అనంతరం గ్రామ పెద్ద వాడమదుల జగ్గయ్య తల్లి పెద్దకర్మలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, వార్డు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన సురేష్‌బాబు



హోం మంత్రి తానేటి వనితతో సురేష్‌బాబు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను శనివారం డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరానికి వచ్చిన ఆమెను ఒక హోటల్‌లో కలిసి ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. ట్రస్ట్ సభ్యులు హేమ, జాషువ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

- ఒక వాహనం సీజ్

గోపాలపట్నం: ఫ్యాన్సీనంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాక, ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని డీటీసీ రాజారత్నం తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్ అర్హత పెంపుపై హర్షం

ఎంవీపీకాలనీ: గ్రూప్-1 అభ్యర్థుల అర్హత పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో గ్రూప్-1 మెయిన్స్‌కు 1:20 నిష్పత్తిలో అభ్యర్థులను ఏపీపీఎస్సీ మెయిన్స్‌కు ఎంపిక చేసేదన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో ఆ నిష్పత్తిని 1:50కి పెంచాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో మెయిన్‌కు అవకాశం కల్పిస్తూ ఏపీపీఎస్సీ నిర్ణయం ప్రకటించడంపై అభినందనలు తెలియజేశారు.

సూర్య దేవుడికి భక్తుల నీరాజనం

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి



ఈస్ట్ షిర్డీ ఆలయంలో హారతి అందుకుంటున్న భక్తులు



పైనాపిల్ కాలనీ వద్ద ఏడు గుర్రాల రథంపై సూర్యభగవానుడు



ఆలయం ప్రాంగణంలో భక్తుల సందడి

ఆరిలోవ: రథసప్తమిని నియోజకవర్గ వాసులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. పైనాపిల్ కాలనీ ఎదురుగా బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన సింహాచలం దేవస్థానం నిర్వహణలో ఉన్న సూర్యభగవానుడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సప్తాశ్వాల రథంపై సూర్యభగవానుడి విగ్రహాన్ని దేవస్థానం సుమారు నాలుగేళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ప్రతీ ఆదివారం భక్తులు ఇక్కడికి వచ్చి, ఆదిత్యుడిని దర్శించుకుంటున్నారు. రథసప్తమి కావడం, నగరంలో ఇదొక్కటే సూర్య భగవానుడి ఆలయం కావడంతో ఆరిలోవ, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, సింహాచలం, అడవివరం, గోపాలపట్నంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు నిలిపిన వాహనాలతో బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు నిండిపోయింది. బసవన్నలు ఎద్దులను ఆడించి, భక్తులను దీవించారు. కొబ్బరికాయలు, పిల్లల ఆట బొమ్మల విక్రయాలు చేసేవారితో అంతటా సందడి నెలకొంది. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహకారంతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎవరికీ ఇబ్బంది కలగలేదు.

ఈస్ట్ షిర్డీ ఆలయంలో..

ఏయూక్యాంపస్: రథసప్తమిని ఈస్ట్‌షిర్డీ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సూర్య నారాయణ మూర్తి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనాలు చేసుకున్నారు. ఆవుపాలతో, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యక్ష దైవంగా భావించే సూర్యనారాయణుని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో భాగంగా గోశాల ఆరుబయట ప్రాంగణంలో ఆవుపిడకలను వెలిగించి పురోహితులు ప్రత్యేకంగా పరమాన్నం తయారు చేసి, సూర్యనారాయణ మూర్తికి నివేదన చేశారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

ఆరిలోవ: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సూర్యభగవానుడి ఫొటోలతో ముద్రించిన క్యాలండర్‌ను ఆవిష్కరించారు.



గోశాలలో పరమాన్నం వండుతున్న అర్చకులు

థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు కంటి సమస్యలు

ఆరిలోవ: థైరాయిడ్‌తో బాధపడుతున్న వారికి కంటి సమస్యలు కూడా వచ్చే అవకాశముందని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు మల్లు అఖిల తెలిపారు. థైరాయిడ్ కంటి వ్యాధిపై శనివారం ఆమె వివరించారు. థైరాయిడ్ ఉన్న వారిలో ఎక్కువ మందికి కంటి కదలికలో పరిమితి, ద్వంద్వ దృష్టి, చూపు కోల్పోవడం తదితర తీవ్రమైన సమస్యలకు దారితీస్తుందన్నారు. ఈ పరిస్థితిలో కొంతమందికి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సమస్య ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాంటివారు కంటి వైద్యులను సంప్రదించి తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. థైరాయిడ్ కంటి వ్యాధి అనేది ఒక రుగ్మత లాంటిదన్నారు. థైరాయిడ్‌తో బాధపడుతున్న వారి శరీరంలో విడుదలైన హార్మోన్లు కంటి చూపుపై ప్రభావం చూపుతాయన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో వస్తుందన్నారు. దీంతోపాటు దీర్ఘకాలంగా ధూమపానానికి అలవాటుపడిన వారిలో కూడా ఎక్కువగా వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. దీనిపై జాగ్రత్త అవసరమని డాక్టర్ అఖిల సూచించారు.

శాంతి ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు



కార్యక్రమంలో పాల్గొన్న సుదర్శనరావు తదితరులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు శాంతి ఆశ్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏయూ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య రొక్కం రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థుల కోసం 60 ప్లాస్టిక్ కుర్చీలను వితరణ చేశారు. విద్యార్థులకు పలు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, మధ్యాహ్న భోజనం అందించారు. విద్యార్థులతోను, యాజమాన్యంతోను మమేకమై వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పలు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సంస్థ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య మాధవి, పద్మశ్రీ డాక్టర్ ఎస్వీ ఆదినారాయణరావు, మానవత ఏయూ యూనిట్ చైర్మన్ ఆచార్య సుదర్శనరావు, అధ్యక్షుడు ఆచార్య పరమేశ్వరరావు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

30 నుంచి కుష్టువ్యాధిపై అవగాహన

మహారాణిపేట : జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 13 వరకు కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు పాల్గొని కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. చర్మంపై ఎర్రని రాగి రంగు స్పర్శ లేని మచ్చలు, శరీరం, ముఖంపై బొడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, చేతి వేళ్లు వంగిపోవడం, కాళ్లు, పాదాలు వాలిపోవడం, కళ్లు మూత పడకపోవడం వంటివి కుష్టువ్యాధి లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు ఆశ లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలని అన్నారు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అంగవైకల్యం గల వారికి ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్స చేయించి అదనంగా 8 వేల రూపాయల పారితోషకం అందిస్తుందని డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తులు లేదా కుటుంబ సభ్యులకు ఉచితంగా సాంతిక విద్యలో శిక్షణ అందజేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

అలరించిన గానలహరి



ఉప్పలపాటి జానకిదేవి, ప్రకాష్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అల్లిపురం: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు పీబీ శ్రీనివాస్ స్మారకార్థం ఎంటీఆర్ సినీ సాంగ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీబీ శ్రీనివాస్ గానలహరి ఆహూతులను అలరించింది. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో సంస్థ అధ్యక్షుడు ఎం.త్రినాథరావు, మహ్మద్ ఖాన్, లాయర్ శ్రీదేవి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మి సాత్విక్, కందర్ప రాధ, ఎస్ఎస్ఎన్ రాజ, లక్ష్మణ్, లయ, శశికళ, నాగలక్ష్మి పాడిన గీతాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి జానకిదేవి, ప్రకాష్ దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గంటి మురళి, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ, జీఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో ఆధునిక లిఫ్ట్ ప్రారంభం



లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆధునిక లిఫ్ట్‌ను సీఎండీ కె.సంతోషరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఏర్పాటుతో దాదాపు 250 మంది ఉద్యోగులకు, సుమారు 600 మంది పింఛన్‌దారులకు, సర్కిల్ కార్యాలయానికి వచ్చిన వందలాది వినియోగదారులకు చాలా సౌలభ్యంగా ఉంటుందన్నారు. లిఫ్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోని తీసుకొచ్చిన విశాఖ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్‌ను సీఎండీ అభినందించారు. లిఫ్ట్‌ను ఉపయోగించి పనితీరును పరిశీలించారు. సుమారు రూ.28 లక్షలతో లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగులు, పింఛన్ వ్యవహారాల కోసం పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అవస్థలు పడేవారని, వీరి సౌలభ్యం కోసం పది మందిని ఒకే సారి తీసుకుని వెళ్లగలిగే ఆధుని లిఫ్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్య క్రమంలో డైరెక్టర్ బి.రమేష్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ డా.ఎ.వి.వి.సూర్యప్రతాప్, ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, అనసూరి రాధిక, చీఫ్ జనరల్ మేనేజర్ వి.విజయలలిత, జోన్-1 కార్యనిర్వాహాక ఇంజినీర్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు శ్రీ భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం ఈ అధివాస మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఒక్కో అధివాసంలో ఒక్కో పత్రితో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ వారం వాకుడు(బృహతి) పత్రితో పూజ నిర్వహించనున్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూర్ణిమ

మద్దిలపాలెం: జంతు సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పశుసంవర్ధక శాఖ ఇసుకతోట వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.పూర్ణిమ అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం హెచ్‌బీ కాలనీ జీవీఎంసీ స్కూల్‌లో విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతులను తోటి ప్రాణులుగా పరిగణించాలన్నారు. వాటిని కొట్టడం హింసాత్మక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. పశువులను రోడ్లపైకి విడిచిపెట్టకూడదని, అవి ప్రమాదాలకు గురై గాయాలపాలవుతాయన్నారు. వాటి సంరక్షణ బాధ్యతలను యాజమానులు తీసుకోవాలన్నారు. పాల అధిక ఉత్పత్తికి హార్మోన్లు సంబంధించిన ఇంజక్షన్లు ఇవ్వడం హానికరమన్నారు. కార్యక్రమంలో జేడీవో శశికళ, హెచ్ఎం రాంప్రసాద్, శారద పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

సీతమ్మధార: నగరంలోని ఒక హోటల్‌లో పేకాటాడుతున్న పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం కొందరులు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 90 వేలతోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి రోజా



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న మంత్రి రోజా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో నరసింహరాజు అందజేశారు. రోజా వెంట ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఉన్నారు.

కరాటే పోటీల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్

మురళీనగర్: ఆల్ ఇండియా వాడొక్కై కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు మురళీనగర్‌లోని హేమ అబోడ్స్‌లో పోటీల లోగోను ఇండియా వాడొర్యై కరాటే అధ్యక్షుడు, సినీ నటుడు సుమన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు, బీజేపీ గాజువాక అధ్యక్షుడు కె.నరసింగరావు, బొత్సా సురేష్, అంగా రాము, చీఫ్ ఆర్గనైజర్ సిహెచ్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభాత సూర్యుడికి ప్రణామం



సూర్యనమస్కారాలు చేస్తున్న యోగ సాధకులు

- గాదిరాజు ప్యాలెస్‌లో సామూహిక సూర్యనమస్కారాలు

ఎంవీపీకాలనీ: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని 18వ వార్డు బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ ఆవరణలో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఓం ఉచిత యోగా సెంటర్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారు జామున ఈ కార్యక్రమం జరిగింది. 108 సూర్య నమస్కారాల కార్యక్రమంలో 150 మంది యోగ సాధకులు పాల్గొన్నారు. సూర్య భగవానుడు సమస్త జగత్తుకు ఆధారమని, సూర్య నమస్కారాలు చేయడం వలన శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తాయని యోగా గురువులు వెల్లడించారు. అధ్యాత్మికంగా ఉన్నత స్థితికి వెళ్లడానికి ఇది మంచి మార్గమన్నారు. 12 ఆసనాలు, 12 స్థితులు, 12 రాశుల్లో సూర్యుని స్థితిని సూచిస్తాయన్నారు. ఏయూ యోగా కేంద్రం డైరెక్టర్ ఆచార్య భానుకుమార్, జిల్లా యోగా అసోసియేషన్, ఓం యోగా సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సూర్యనమస్కారాలతో సంపూర్ణ శక్తి

తాటిచెట్లపాలెం: సూర్యనమస్కారాల ద్వారా సూర్యుడిలో ఉండే శక్తిని స్వీకరించగలమని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్ క్లబ్‌లో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో శనివారం రథసప్తమి సందర్భంగా ఏర్పాటు చేసిన సూర్యనమస్కారాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 108 సార్లు సూర్య నమస్కారాలు చేయడం సులువైన పనికానప్పటికీ దీనిని అవలంబించడం వల్ల క్రమశిక్షణ, స్వావలంబన, మరింత పదునైన మనసు లభిస్తుందన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు, ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీల కుల గణన చేపట్టండి



జీవీఎల్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీసీ సంఘ నేతలు కేసన శంకరరావు, గొర్లె శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఓబీసీల కుల జనగణన వెంటనే చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావును కోరామని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎల్‌ను శనివారం కలిసి ఈమేరకు చర్చించి, వినతిపత్రాన్ని అందించామని చెప్పారు. కేవలం రాజకీయం పోరాటం ద్వారానే బీసీ సాధికారత సాధ్యమవుతుందని ఈ సందర్భంగా జీవీఎల్ పేర్కొన్నారని వారు తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు దామాషా విధానాన్ని అనుసరించి సీట్లు కేటాయించద లేదని అన్నారన్నారు. బీసీల సంక్షేమానికి, వారి రాజకీయ ప్రాధాన్యానికి తగిన న్యాయం చేయాలని ఎంపీని కోరామన్నారు. మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ద్వారక శ్రీను, గోపి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయండి



చైతన్య సదస్సులో పాల్గొన్న పాలిటెక్నిక్ విద్యార్థులు



మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి

మురళీనగర్: దేశం కోసం మనం ఏమి చేయగలమని విద్యార్థులు ఆలోచించాలని రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే దేశంపై ప్రేమ, త్యాగం అనే ముఖ్యమైన గుణాలను అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయులు అత్యంత మేధోశక్తి గల వారన్నారు. ఎవరి శక్తిపై వారికి సంపూర్ణమైన నమ్మకం కలిగి ఉన్నప్పుడు అనుకున్నది సాధించగలరని చెప్పారు. విద్యార్థులు మంచి విలువలు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తయారు కావాలని, అందుకు అధ్యాపకులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్‌లో పాల్గొని దేశానికి సేవ చేయాలని రమన్ పూరి పిలుపునిచ్చారు. ఇన్నోవేషన్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. తెలివైన, మేధావులైన విద్యార్థులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల దేశానికి నష్టం కలుగుతుందని వివరించారు. స్వదేశీ సాంకేతిక అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ జీవనానికి నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు



మాట్లాడుతున్న ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వంశీ

సీతంపేట: గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ-ప్రకృతి పరస్పర చర్యలు పెరిగాయని ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వకులాభరణం వంశీ అన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. వ్యక్తిగత సంపద అసమానత స్థాయిల్లో చిన్నదైన కానీ గుర్తించదగిన పెరుగుదలతోపాటు వాస్తవంగా అన్ని సమూహాల్లో దేశంలో సంపదల స్థాయిలు పెరిగాయన్నారు. కార్ల్‌మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సిహెచ్.రాఘవేంద్రరావు, సీపీఐ కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.